ప్రజాశక్తి
ఆదివారం 20 నవంబర్ 2022
5
శ్రీ సత్యసాయి

ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

జిల్లా కోర్టు విభజనకు సహకరించండి

కలెక్టర్లను కోరిన జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా కోర్టు విభజనకు సహకరించాలని ఉమ్మడి అనంత జిల్లాల కలెక్టర్లను అనంతపురం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ కోరారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన ఛాంబర్‌లో రెండు జిల్లాల కలెక్టర్లు ఎస్.నాగలక్ష్మి, బసంత్ కుమార్, ఎస్పీలు డా॥ఫక్కీరప్ప, రాహుల్ దేవ్ సింగ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రాల్లో అన్ని రకాల న్యాయ సేవలు ఒకే చోట పొందేలా జ్యుడీషియల్ కాంప్లెక్సుల నిర్మాణాలు ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించి భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ చేపట్టాలన్నారు. స్థల సేకరణలో ఆలస్యానికి కారణమవుతున్న భూవివాదాలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జిల్లాలో పట్టుబడిన మాదక ద్రవ్యాలను సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం భద్రపరచాలని ఎస్పీలను ఆదేశించారు.

అడ్వొకేట్ క్లర్కులకు ఇళ్ల పట్టాలు అందించేందుకు కృషి చేస్తాం :కలెక్టర్

ఇళ్ల పట్టాలకు అర్హత కలిగిన అడ్వొకేట్ క్లర్కులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ప్రిన్సిపల్ జిల్లా జడ్జి నిర్వహించిన సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్‌ను అడ్వొకేట్ క్లర్కులు, జిల్లా కోర్టు ఉద్యోగులు కలిసి తమకు ఇళ్ల పట్టాలు, స్థలాలు మంజూరు చేయాలని కోరారు. వారి అర్జీలు స్వీకరించి అడ్వొకేట్ క్లర్కులు అందరికీ ఒకే చోట ఇళ్ల పట్టాలు అందించేలా చూస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. గతంలోలాగా జిల్లా కోర్టు ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు.

డివైడర్‌ను ఢీకొని నుజ్జునుజ్జు అయిన కారు ముందు భాగం

ఘోర రోడ్డుప్రమాదం

◆ పర్వతదేవరపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొన్న కారు

◆ ముగ్గురు మృతి ◆ ఇద్దరికి గాయాలు

కనగానపల్లి మండలం పర్వతదేవరపల్లి జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. డివైడర్‌ను కారు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మరణించారు. ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, గాయపడిన వారంతా తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం విచారకరం.

వార్త మెయిన్‌లో..

పెరుగుతున్న పచ్చదనం

◆ పదేళ్ల ప్రణాళికకు రూపకల్పన ◆ కంపా నిధుల్లో ఈ ఏడాది కోత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రకృతి అనుకూలత, సంరక్షణకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పచ్చదనం పెరుగుదల కనిపిస్తోంది. ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి శాటిలైట్ ద్వారా పచ్చదనం ఏ మేరకున్నది అన్న వివరాలను తీసుంటూ ఉంటుంది. ఇందులో చూసినప్పుడు జిల్లాలో 2015-17 కాలంలో పచ్చదనం పెరుగుదల కనిపించినట్టు అనంతపురం జిల్లా ఫారెస్టు అధికారి సందీప్ కృపాకర్ గుండాల తెలిపారు. స్క్రబ్ అటవీ ప్రాంతం 1111హెక్టార్లు పచ్చదనం పెరిగినట్టు గుర్తించారు. అదే ఓపెన్ అటవీ ప్రాంతంలో 774 హెక్టార్లు పెరిగినట్టు శాటిలైట్ ద్వారా గుర్తించినట్టు ఆయన వివరించారు. అయితే ఆ తరువాత 2017-19 సంవత్సరాల్లో ఒక్క శాతం మాత్రమే పెరుగుదల ఉన్నట్టు తెలిపారు. అది కూడా కొత్త అటవీ ప్రాంతంలో అభివృద్ధి చేసే క్రమంలో పెరుగుదల పెద్దగా లేకపోవడానికి కారణమని, రాబోయే రెండేళ్ల రిపోర్టు 2019-21 నివేదికలో మరింత పెరిగే అవకాశముండొచ్చని చెప్పారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో అటవీ సంరక్షణ చర్యలతోపాటు, పెరుగుతున్న ఉద్యానవన పంటలు పచ్చదనం పెరుగుదలకు కారణాలుగా అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా రెండు లక్షల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో అనంతపురం జిల్లాలో తక్కువగా 73 వేల హెక్టార్లలో విస్తరించి ఉంది. సత్యసాయి జిల్లాలో 1.24 లక్షల వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో అత్యధికంగా ఓపెన్ ఫారెస్టుయే అధికంగా ఉంటుంది. ఇందులో అటవీ ప్రాంతం పెంచేందుకు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం 'కంపా' కింద నిధులను కేటాయిస్తుంది. ఈ నిధులను ద్వారా స్క్రబ్, ఓపెన్ ఫారెస్టులను అభివృద్ధి చేయడం జరుగుతుంది.

కంపా నిధులు ఈ ఏడాది కోత

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కంపా కింద నిధుల కేటాయింపుల్లో కోతలను విధించింది. ఏడాది ప్రణాళిక సమయంలో మొదట రూ.11. కోట్లకు ప్రతిపాదనలను పంపించారు. సుమారు 400 హెక్టార్లలో అటవీ ప్రాంతం అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. అయితే మొదట ఐదు కోట్ల నిధులు మాత్రమే కేటాయించింది. అందులోనూ సగమే విడుదల చేసి నిలిపివేసింది. పూర్తి స్థాయి నిధులు విడుదల చేసి ఉంటే జనవరి నుంచి మార్చిలోపు కొత్త ప్రణాళిక ప్రకారం అటవీ అభివృద్ధికి అవసరమైన చర్యలను చేపట్టాల్సి ఉంటుంది. నిధులు కేటాయించకపోవడం వల్ల వచ్చే ఏడాది చేపట్టాల్సిన ఉంటుంది. నిధులలేమితో ఆగిపోయే పరిస్థితి ఉంది.

వచ్చే పదేళ్ల ప్రణాళిక రూపకల్పన

ప్రతి పదేళ్లకు ఒకసారి జిల్లాలో చేపట్టబోయే అటవీ సంరక్షణ ప్రణాళికను రూపొందిస్తారు. దానికి అనుగుణంగా రాబోయే రోజుల్లో చర్యలుంటాయి. గడిచిన పదేళ్ల ప్రణాళిక ముగియనుంది. దీంతో రాబోయే పదేళ్ల ప్రణాళిక రూపకల్పను చేస్తున్నారు. రాబోయే పది రోజుల్లోపు ఇది పూర్తికానుంది.

మడకశిర వైసిపిలో లుకలుకలు

◆ హిందూపురంలో అసమ్మతి నేతల రహస్య సమావేశం

◆ ముఖ్యనేత తీరుపై నిరసన గళం

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర నియోజకవర్గం అధికార పార్టీలో విభేదాలు తారాస్థాయికి చేరినట్లు కన్పిస్తున్నాయి. కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు ఏకంగా ముఖ్య ప్రజాప్రతినిధి తీరుపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం నాడు మాజీ శాసనసభ్యులు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వైసిపి ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు హిందూపురంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో రహస్యంగా సమావేశం అయ్యి, భవిష్యత్తు కార్యచరణపై మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మడకశిరలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కంటే, స్థానిక ప్రజాప్రతినిధి అవినీతి అక్రమాలు అధికంగా ఉన్నాయని అసమ్మతి నేతలు అభిప్రాయ పడ్డారు. దీని వల్ల నియోజకవర్గంలో వైసిపి మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తే సొంత పార్టీ నేతలపై కూడా కేసులు పెడుతున్నారని, ఈ విషయంపై గట్టిగా ప్రతిస్పందించి అధిష్టానం దష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. భవిష్యత్తులో మడకశిరకు మంచి నాయకున్ని అందించాలనే విషయాన్ని అధిష్టానం దష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే, మరోవైపు స్థానిక ప్రజాప్రతినిధి అవినీతి అక్రమాలను ఎండగట్టుదామని అసమ్మతి నేతలు నిర్ణయించుకున్నారు.

మహిళా సంఘాల అభివృద్ధిలో యానిమేటర్ల పాత్ర కీలకం

సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నరసయ్య

బత్తలపల్లి : మహిళా సంఘాల అభివృద్ధిలో ఆనిమేటర్ల పాత్ర కీలకమని డిఆర్‌డిఎ పీడీ నరసయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘం ఆనిమేటర్ల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథుగా పీడీతో పాటు ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి, డిపిఎం (చేయూత) రమణప్ప, ఎపిఎం సుదర్శన్ రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పొదుపు సంఘాలను మరింత బలోపేతం చేయాలన్నారు. వారికి జీవనోపాధులు కల్పించాలన్నారు. స్త్రీనిధి రుణాల మంజూరు, వసూళ్లలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉన్నతి రికవరీ, సిఐఎఫ్, జగనన్నతోడు, బ్యాంకు లింకేజీ(ఆసరా, సున్నావడ్డీ) తదితర అంశాల గురించి వివరించారు. అనిమేటర్ల పనితీరు. పుస్తక నిర్వహణ గురించి ఆరా తీశారు. ఆర్థికలావాదేవీల నిర్వహణ, గ్రామ సంఘాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసే విషయమై వేగంగా స్పందించాలన్నారు. ప్రతి గ్రామ సంఘం డిసెంబర్లో జనరల్ బాడీ మీటింగ్ జరపడంపై సమీక్షించారు. ఈ సమావేశంలో మండలంలోని అనిమేటర్లు, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి : మండలంలోని దాడితోట గ్రామపంచాయతీలో శనివారం నిర్వహించిన యానిమేటర్ల సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథి గా సత్యసాయి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక నిర్వహణ , సంస్థాగత నిర్మాణం, జీవనోపాదులు, స్త్రీ నిధి రుణాలు, రికవరీ తదితర విషయాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సాంబశివుడు, సిసిలు నారాయణమూర్తి, గంగాధర, మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధితుడి సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ

సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-హిందూపురం

నియోజకవర్గ వ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా ప్రజలు వారి సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ కోరారు. శనివారం తన కార్యాలయంలో ప్రజా దర్బార్‌ను ప్రారంభించారు. తొలి రోజు వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రాబోవు రోజుల్లో ప్రతి వారం అధికారులతో కలిసి నిర్వహిస్తామని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో 'డైట్' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి బుక్కపట్నం

సత్య సాయి బాబా 97వ జన్మదినాన్ని పురస్కరించుకొని సత్య సాయి బాబా స్కూల్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలలో బుక్కపట్నం డైట్ కళాశాల ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఇంద్రాణి ప్రతిభ కనపర్చింది. రాష్ట్రస్థాయి పోటీల్లో తృతీయ బహుమతిని గెలుపొందింది. ఈ బహుమతిని సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ ద్వారా అందుకుంది. ఇంద్రాణినిడైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

రత్నాకర్ చేతులమీదుగా జ్ఞాపికను అందుకుంటున్న విద్యార్థిని

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి

కదిరి టౌన్ : పోటీ పరీక్షలలో విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని కస్టమ్స్ జాయింట్ కమిషనర్ బైరెడ్డి లోకనాథ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలలో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ తాము ఎంచుకొన్న అంశాలలో అవగాహన పెంచుకుని విజయావకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోకస్టమ్స్ శాఖ జాయింట్ కమీషనర్ బైరెడ్డి లోకనాథ రెడ్డి, సభ వ్యాఖ్యాతలుగా మహమ్మద్ ఆలీ, సుందర మోహన రెడ్డి, వినాయక హోండా ఎమ్‌డి కిషోర్ కుమార్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత

పుట్టపర్తి రూరల్ : ఇటీవల ప్రమాదానికి గురైన రజక కుటుంబానికి చెందిన నాగరాజుకు ఆంధ్ర ప్రదేశ్ రజక సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. రజక సంఘం ఆధ్వర్యంలో 25 వేల రూపాయల నగదును పుట్టపర్తి మండలం ఎనమలపల్లి గ్రామానికి చెందిన వీరజిన్నప్ప కుమారుడు నాగరాజుకు అందజేశారు. నాగరాజుకు ఇటీవల ట్రాక్టర్ ట్రాలీ పడి వెన్నుపూస దెబ్బతినింది. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాపనపల్లి శివప్ప, రాష్ట్ర కార్యదర్శి తేలిక ఆంజనేయులు, రజక సాధికారిక సమితి స్టేట్ డైరెక్టర్ రామచంద్ర, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబులెన్స్ రమేష్, జిల్లా కన్వీనర్ బాపనపల్లి శ్రీనివాసులు, కదిరి డివిజన్ నాయకులు శివశంకర్, జిల్లా నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందజేస్తున్న నాయకులు

సత్యసాయి జయంతి వేడుకలకు 60 ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్య సాయి జయంతి వేడుకలకు 60 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ ప్రజా రవాణా జిల్లా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ప్రతి డిపో నుంచి అదనపు బస్సులు నడుపుతామన్నారు. ఈనెల 22 నుంచి 24 వరకు జిల్లాలోని ప్రతి రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక సర్వీసులు నడుస్తాయన్నారు. హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, విజయవాడ తదితర నగరాలకు పుట్టపర్తి నుంచి రాకపోకలకు తగిన బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. బాబా జయంతి రోజు జిల్లా నలుమూలల నుంచి గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రతి డిపో నుంచి అదనపు సర్వీసులు నడుస్తాయన్నారు. భక్తులు, పర్యాటకులు, ప్రజలు కోరితే ప్రత్యేక బస్సులు కూడా నడుపుతామని ఆయన చెప్పారు.

ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల

విద్యార్థులకు కంటి వైరస్

పిల్లలను ఓ గదిలో బంధించిన ప్రిన్సిపల్

ప్రజాశక్తి కదిరి టౌన్

పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల లో దాదాపు 150 మంది విద్యార్థులు కంటి వైరస్ సమస్యతో బాధపడుతున్నారు. పట్టణంలోని కుటాగుల రైల్వే గేట్ వద్ద ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో దాదాపు 150 మంది గిరిజన విద్యార్థులు కంటి వైరస్ తో బాధపడుతుండగా వారిలో 15 మంది విద్యార్థులకు వ్యాధి తీవ్రత అధికంగా ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి పిల్లలను పంపించండి అని అడిగినా పంపించకుండా ఒక ప్రత్యేక గదిలో బందించడంతో విద్యార్థి సంఘం నాయకులు స్కూలు ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జాన్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ నాయక్, వార్డెన్ దుర్గాప్రసాద్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంటి వైరస్ తో పాటు జ్వరంతో బాధపడుతున్న వారికి ఎలాంటి చికిత్సలు చేయించకుండా ఇలా ఒకే గదిలో ఉంచడంపై ప్రిన్సిపల్ వెంకటరమణ నాయక్‌కు ప్రశ్నిస్తే మిగిలిన విద్యార్థులకు ఎవరికి సోకకుండా ఇలా చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా కన్వీనర్ మురళి రావడంతో గది తాళాలు తీశారు. ఈ విధంగా అందరినీ ఒకేచోట బంధించడం వలన వ్యాధి తీవ్రత ఎక్కువై ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్లో ఎటు చూసినా అపరిశుభ్రత నెలకొని ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరకు నాయకులే 108కు సమాచారం అందించి విద్యార్థులను హాస్టల్ వార్డెన్ తో పాటు ప్రభుత్వాసుపత్రికి తరలించారు .ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లజోడు పవన్, శేషం మహేంద్ర, జిల్లా సహాయ కార్యదర్శి ఉపేంద్ర ,కదిరి నియోజకవర్గ ఎఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశాలపై నిరాసక్తి

మండలమీట్‌కు సభ్యుల గైర్హాజరు

సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

సమస్యలు ఎలాగో పరిష్కారం కావడం లేదు..! సమావేశం దేనికి అనుకున్నారో ఏమో గాని ఎంపిటిసిలు సంతకాలు పెట్టి వెళ్లిపోగా పలువురు సర్పంచులు సమావేశానికి గైర్హాజరయ్యారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి సభ్యులు నామమాత్రంగా హాజరు కావడంతో సమావేశం బోసి పోయింది. అధ్యక్షుడితో పాటు వైసిపి లో క్రియాశీలకంగా ఉన్న ప్రజా ప్రతి నిధులు గైర్హాజరు కావటంతో కేవలం గంటన్నర సమయంలోనే సమావేశం ముగిసింది. అధ్యక్షులు గైర్హాజరు కావటంతో ఉపాధ్యక్షుడు బయప్ప అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా సమస్యలు అసలు చర్చకు రాలేదు. జడ్పీటీసీ అనూషా మాత్రం చేనేపల్లి పాఠశాలకు నూతన భవనం,సిమెంట్ రోడ్లు వేగవంతం చేయాలని విన్నవించారు. మండలంలో అనేక సమస్యలు ఉన్న ఏవీ చర్చకు రాలేదు. దీనికి కారణం గత మూడు సమావేశాల్లో ప్రజాసమస్యలపై చర్చ జరిగినా తీసుకున్న కర్తవ్యాలు ఏ మాత్రం అమలు కాక పోవడమే అని తెలుస్తోంది. గత మూడు సమావేశాల్లో సర్పంచులు, ఎంపిటిసిలు అనేక సమస్యలను విన్నవించినా అవి ఏమాత్రం పరిష్కారం కాక పోవడంలో సభ్యులు అసంతృప్తితో ఉన్నారు. మరో వైపు సర్పంచులకు వచ్చిన ఆర్థిక సంఘం నిధులు విద్యుత్, స్వచ్ఛ భారత్ కార్మికులకు ఖర్చు చేయాలని ఆదేశాలు రావటం, ఎంపిటిసిలు చేసిన పనులుకు బిల్లులు రాకపోవడం వంటి కారణాల నేపథ్యంలో సమావేశాల పట్ల సభ్యులు ఆసక్తి చూపడం లేదు. మూడు నెలలుకొకసారి జరిగే సర్వసభ్య సమావేశాలు కేవలం అలంకార ప్రాయంగానే ఉంటున్నాయన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి. శనివారం నామ మాత్రంగా జరిగిన ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి యోగానంద్, అభివద్ధి అధికారి రాంకుమార్, విస్తరణ అధికారి సుభాషిణితో పాటు వివిధ శాఖల అధికారులు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు భూమిపూజ

రొద్దం : మండలంలోని యం.కొత్తపల్లి గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులకు ఎంపిపి చంద్రశేఖర్ శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర స్టేట్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, తహశీల్దార్ అనంతచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, హౌసింగ్ ఏఈ. ఖాజాఉద్దీన్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుకు చేయూత

నల్లమాడ : ఎడిసిసి బ్యాంక్ అధికారులు, సొసైటీ పాలకవర్గం సభ్యులు, సిబ్బంది సహకారంతో రైతులకు చేయూత అందిస్తున్నామని నల్లమడ సహకార సంఘం అధ్యక్షులు పులివెందుల గంగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో శనివారం 69వ సహకార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. సొసైటీ అధ్యక్షులు గంగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సోదరుడు శ్రీనివాసులు రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కారక్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు ముదిగుబ్బ బ్రాంచ్ మేనేజర్ గోపాల్, మండల అగ్రి బోర్డు చైర్మన్ రఘునాథ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామాంజనేయులు, సొసైటీ డైరెక్టర్లు, ముదిగుబ్బ బ్రాంచ్ సూపర్వైజర్ మల్లికార్జున, సొసైటీ సీఈవో కేశవులు, ఆదినారాయణ, శ్రీరాములు, మాబు, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కాగృహాలు

నల్లమాడ : మండల వ్యాప్తంగా అర్హులందరికీ ఇంటిస్థలంతో పాటు పక్కాగృహాలు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ దేవేంద్ర నాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి అంజి, నాయకులు ఆయా సాబ్, వెంకటరమణ, నాగేంద్ర, గంగప్ప, చలపతి, సుధాకర్, ఆదిలక్ష్మి, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

కొత్తచెరువు : స్థానిక జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలను తహశీల్దార్ రామాంజనేయరెడ్డి ఎంపీడీవో సిద్ధారెడ్డి శనివారం పరిశీలించారు కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఎక్కువమంది పునాదులకే పరిమితమయ్యాయని వెంటనే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గృహాలు నిర్మించుకోకపోతే ఇళ్ల పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల వేలం

అమడగూరు : వివిధ కేసుల్లో పట్టుబడిన 35 ద్విచక్రవాహనాలను, ఒక ఆటోను స్థానిక స్టేషన్‌లో శనివారం వేలం నిర్వహించారు. ఈ వేలంపాటలో మొత్తం 4,75,200లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తనకల్ సెబ్ ఇన్స్‌పెక్టర్ జయనాథ్‌రెడ్డి, నల్లమాడ సిఐ నిరంజన్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

మడకశిర : మడకశిర రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులకు రక్తపరీక్షలను శనివారం నిర్వహించారు. 350 మంది విద్యార్థిని విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, డాక్టర్ రవిశంకర్, హిందూపురం రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ తిమ్మారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ శ్రీ మధుసూదన్, లోకేష్ రెడ్డి, మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల వారోత్సవాలు

పరిగి : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం బాలల హక్కుల దినోత్సవాన్ని సిడిపిఒ రెడ్డి రమణమ్మ ఆధ్వర్యంలో సూపర్వైజర్ లలితమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాల్యవివాహాల వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల రక్షణ కోసం ఏర్పాటుచేసిన దిశ యాప్ వినియోగం ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ సువర్ణమ్మ, అంగన్వాడీలు సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు

బత్తలపల్లి : త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని మండల అధికారులు లబ్ధిదారులకు సూచించారు. ఆవాజ్ దినోత్సవం (హౌసింగ్ డే) కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోనిజగనన్న లేఅవుట్‌లో తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీవో సాయి మనోహర్, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు బిల్లులు ఇవ్వడంలో ఆలస్యం అవుతుందని అపోహ పెట్టుకున్నారని అలాంటి అపోహలు నమ్మొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన జనం

కదిరి టౌన్ : కార్తీకమాసం చివరి శనివారం సందర్భంగా కదిరిలోని శ్రీఖాద్రీశుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుఝుమున నుండి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఆలయ ప్రాంగణముతో పాటు తీరుమాడ వీధులు భక్తులతో కిటకిటలాడాయి.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పుట్టపర్తి అర్బన్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం సాయి కుల్వంత్ హాలు లో సత్యసాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. చేతన ఫౌండేషన్ స్థాపకురాలు రాజేశ్వరి పాటిల్ ఈ కార్యక్రమాన్నిప్రారంభించారు. ప్రొఫెసర్ రాజేశ్వరి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని స్వయం శక్తితో ఎదగడానికి మహిళలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు దేశ విదేశీ మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు యశోద పాఠశాల విద్యార్థి

ధర్మవరం టౌన్ : స్థానిక యశోద పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థిని జగదీశ్వరి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. హిందూపురంలో ఎంజీఎం క్రీడామైదానంలో రెండు రోజుల క్రితం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-17 వాలీబాల్ విభాగంలో విద్యార్థిని జగదీశ్వరి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. దీంతో ఆ విద్యార్థినిని డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపల్ అనూప్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామ్, అశోక్ అభినందించారు.

ఐకమత్యంతోనే కురుబల అభివృద్ధి

కొత్తచెరువు : ఐకమత్యంతోనే కురుబల అభివృద్ధి సాధ్యమని కురుబసంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ తెలిపారు కొత్త చెరువులోనే టీటీడీ కళ్యాణ మండపం ఆవరణంలో మండలంలోని కురుబ సంఘం నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 27వ తేదీన పుట్టపర్తిలోని సాయి ఆరామంలో నిర్వహించే జిల్లా స్థాయి సమావేశానికి జిల్లాలోని 32 మండలాలకు చెందిన కురుబలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కురుబసంఘం సమావేశానికి సంబందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు తలమర్ల కమ్మన్న, అశ్వర్థ నారాయణ, శివయ్య, రమణ, అంగటి ప్రభాకర్, చెనరాయుడు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నిరసనలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి మడకశిర

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పాఠశాల ముందు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఈరేష్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నాణ్యతగా ఉండటం లేదన్నారు. విద్యార్థులు ఆ భోజనం తినలేక పడేస్తున్నారని అన్నారు. పలువురు విద్యార్థులు ఇంటికి వెళ్లి భోజనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అన్నంలో పలుసార్లు పురుగులు ఉంటున్నాయని ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయాజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఇమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్, నటరాజ్, చరణ్ తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేశాం...

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

హంద్రీనీవా నీటితో నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపి సస్యశ్యామలం చేశామని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కట్టకిందపల్లి చెరువుకు జెడ్పీ వైస్ ఛైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే జలహారతిని ఇచ్చి గంగ పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక విలేకరులతో మాట్లాడుతు రైతాంగం సంతోషంగా వుంటే ప్రతి పక్షాల వారికి కడుపు మంట అయిందన్నారు. ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ తమ ఉనికిని చాటుకుంటున్నారని విమర్శించారు. అంతకు ముందు కామిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి, రాంపురం, కుణుతూరు, పోతుకుంట తదితర గ్రామాలకు చెందిన రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పాటిల్ క్రిష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సర్పంచి సత్యమయ్య, నాయకులు కుణుతూరు శ్రీనివాసరెడ్డి, కేశవరెడ్డి రామయ్య, ఆనందరెడ్డి, ఆర్మీ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు

జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

నంబులపూలకుంట, అమరాపురం మండలాల్లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు సిద్ధారెడ్డి, తిప్పేస్వామి

నంబులపూలకుంట : మండల పరిధిలోని మండెంవారిపల్లి, నాయనవారిపల్లి, పల్లెనేనివారిపల్లి బందారుచెట్ల పల్లి, ఎగువపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాము, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, సర్పంచి అంజనమ్మ, ఎంపీడీవో ఆదినారాయణ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవయ్య, ఆర్‌బికె చైర్మన్ ఆదిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, నాయకులుపాల్గొన్నారు.

అమరాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని వలస, అగ్రహారం గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషనర్ డైరెక్టర్ చిక్కన్న, సింగర్ విండో అధ్యక్షులు బాగాల చిక్కన్న, ఎంపీపీ ఈరన్న , జెడ్పీటీసీ స్వరక్క నరసింహామూర్తి , వైస్ ఎంపిపి కృష్ణమూర్తి,తో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హిందూపురం : పురపాలక సంఘ పరిధిలోని13వ వార్డు ఆటోనగర్‌లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్ళి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను అక్కడిక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబివుల్లా, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, వార్డు కౌన్సిలర్ సునీత వెంకటేశ్వర రెడ్డి, మారుతీరెడ్డి, అయూబ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రొద్దంలో వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

రొద్దం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రూప, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, తహశీల్దారు అనంతాచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, గ్రంథాలయ అధికారి నాగరాజుఉపాధ్యాయులు కిష్టప్ప, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గ్రంథాలయ అధికారి శీనానాయక్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ కృష్ణమోహన్, సర్పంచి బాలమ్మ, హెచ్‌ఎం జగన్మోహన్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లచెరువు : స్థానిక ఎంపీపీ పాఠశాలలో శనివారం గ్రంథాలయ వారోత్సవాలను లైబ్రరీ అధికారి ప్రసాద్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం గ్రంథాలయ అవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజినప్ప, ఎంఇఒ కృష్ణనాయక్, ఇన్ఛార్జి హెచ్‌ఎం జయరాములు, గ్రంథాలయ అధికారిని పరియా భాను, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాధికారి మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం ఖాదర్ వలీ, ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీబాయి, ఉర్దూ స్కూల్ హెచ్‌ఎం తబాసం బేగంతో పాటు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుకు కష్టమే మిగులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో ఈ ఏడాది మంచి వర్షాలు పడ్డాయి. ప్రతి మండలంలోనూ సాధారణం కంటే అధికంగా వర్షాలు పడ్డాయి. ఎక్కడ చూసినా నీటి జాడ కనిపిస్తోంది. అయినా ఏమీ లాభమన్నట్టుగా ఉంది రైతు పరిస్థితి. గతంలో వర్షాల్లేక నష్టపోతుంటే, ఈసారి అధిక వర్షాలు నట్టేట ముంచుతున్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టాక తెగుళ్ల అధికమయ్యాయి . ఈ తెగుళ్ల ప్రభావం రైతు దిగుబడులపై పడుతోంది. అధిక వర్షాలతో ఇప్పటికే పత్తి పంట పూత రాలిపోయి దిగుబడి తగ్గుతోంది. దీంతో కొన్ని చోట్ల పంటను పశువుల మేతకు వదిలేస్తున్నారు. పెట్టుబడి కిందనే ఎకరానికి రూ.30 వేల వరకు నష్టం వాటిల్లింది. అదే విధంగా మిరప పంట అత్యధికంగా నష్టం వాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. నల్లతామర పురుగు ఈ వాతావరణానికి పంటకు అధికంగా ఆశిస్తోంది. పూతలోకి చేరుకుని తినేడం వలన దిగుబడి పడిపోతోంది. దీని నివారణకు పురుగుల మందులు కొట్టేందుకు మరింత వ్యయం పెరుగుతోంది. జిల్లాలో సుమారు 67 వేల ఎకరాల్లో మిరప పంట సాగైంది. దీన్ని రక్షించుకోవడానికి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. టమోట పంట దిగుబడి వచ్చినా ఎగుమతులు చేయడానికి వీల్లేకుండాపోవడంతో ఈసారి రైతుకు పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. ఇప్పుడు అరటి పంటను సిగటోమా భయపెడుతోంది. ఉమ్మడి జిల్లాలో 40 వేల ఎకరాల్లో ఈ పంటలు సాగయ్యాయి. ఒక్క అనంతపురం జిల్లాలోనే 23 వేల ఎకరాల వరకు ఉంది. ఈ తెలుగు వస్తే పంట దిగుబడి ఎలాగున్నా వచ్చిన పంటను కొనేందుకు వ్యాపారులెవరూ ముందుకు రారు. ఈ రకంగా రెండు విధాలుగానూ రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తెగుళ్లతో జరిగే నష్టానికి ఏ మేరకు ప్రభుత్వ సాయం అందుతుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఎందుకంటే అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితుల్లో పంటనష్టం జరిగితే కొంత వరకు బీమా ద్వారానో, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారానో ఆదుకునే అవకాశముంది. తెగుళ్ల వలన నష్టం జరిగితే ఆ అంచనాలు రూపొందించే పక్రియ ఏదీ బీమా పరిధిలో లేదు. దీంతో రైతుకు తెగుళ్ల వలన జరిగే నష్టానికి అందే సహాయం లేదనే చెప్పవచ్చు. ఈ ఏడాది అధిక వర్షాలతో వస్తున్న తెగుళ్లు పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రధానంగా ఉద్యానవన పంటలకు డ్రై కండిషన్స్ ఉంటేనే దిగుబడులకు అనుకూలం. జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూగర్భ జలాలు బాగా పెరగడంతో ఉద్యానవన పంటల సాగు బాగా పెరిగింది. అధిక పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పుడు ఈ వాతావరణానికి తెగుళ్లు అధికమవుతుండటంతో నష్టమూ అదే స్థాయిలో ఉంటోంది. ప్రభుత్వం ఉద్యానవన పంటలకు తెగుళ్ల వలన జరిగే నష్టానికి ఆదుకునే వ్యవస్థ ఏదైనా రూపొందించాలని కోరుతున్నారు. వర్షాధారం కింద సాగైన వేరుశనగ పంటకు ఈసారి గిట్టుబాటు ధర లభించడంలేదు. వ్యాపారులు వేరుశనగ కాయలు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని చెబుతున్నా ఇప్పటికీ ఇంకా ఆ పక్రియ ప్రారంభమవలేదు. ప్రధాన పంట వేరుశనగ రైతు ఇప్పుడు గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నాడు.

డ్రైవర్‌పై సెబ్ సిఐ దాడి

ధర్మవరం టౌన్ : తనమాట వినలేదని సెబ్ సిఐ సైదుల్ తన వద్ద పనిచేసే ప్రయివేటు డ్రైవర్‌ను చితకబాదిన సంఘటన శనివారం ధర్మవరం సెబ్ కార్యాలయంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు... ధర్మవరం మండలంలోని కుణుతూరు గ్రామానికి చెందిన బాబావలి సెబ్ కార్యాలయంలో ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు, అయితే గతకొంతకాలంగా డ్రైవర్ బాబావలిని సెబ్ సిఐ సైదుల్ అనవసరంగా తిడుతూ వేధించేవాడు. దీంతో డ్రైవర్ కూడా సిఐను ప్రశ్నించాడు. ఇందులోభాగంగా బాబావలి శనివారం ఆలస్యంగా వచ్చాడన్న కారణంతో సిఐ కాలితో తన్ని, దుర్భాషలాడుతూ దాడిచేశాడని డ్రైవర్ ఆరోపించాడు. తనపై జరిగిన దాడి గురించి వన్‌టౌన్ స్టేషన్‌లో చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సెబ్ సిఐ సైదుల్‌పై 323, 506 సెక్షన్ల కింద కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

కొటిపి లేఅవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొటిపి లేఅవుట్‌ను సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

హిందూపురం : స్థానిక కొటిపి లేఅవుట్‌ను అధికారులు శనివారం సందర్శించారు. సొంతింటి కల నెరవేరేనా...? అన్న శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్, గృహ నిర్మాణ శాఖలతో పాటు పలు శాఖల అధికారులు శనివారం కొటిపి లేఅవుట్‌ను సందర్శించారు. సచివాలయాల సిబ్బందిని, లబ్దిదారులను పిలిపించి సమస్యలపై చర్చించారు. మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇప్పటిదాక ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ డిఇఇ శివకుమార్, ఎఇ ఫణిరాజ్, విద్యుత్ శాఖ, వివిధ శాఖల అధికారులతో పాటు సచివాలయ కార్యదర్శులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు శ్లాఘనీయం

కొత్తచెరువు : మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలో మరువలేనివని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చిన్నకృష్ణారెడ్డి, గ్రంథాలయ అధికారి కే జయరాం తెలిపారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్ నిట్టూరి సత్యనారాయణ రావు, ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, సుకన్య, డైట్ సూపరింటెండెంట్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ శ్యామ్ కిరణ్, నాయకులు కలీం, హనుమంతరాయప్ప, జియా, సాబ్జన్ తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

మడకశిర రూరల్ : కెవిపిఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ కోరారు. పట్టణంలోని గణేష్ రెస్టారెంట్ వద్ద కెవిపిఎస్ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రమణ మాట్లాడుతూ దళిత గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర సర్వే చేసి ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. డప్పు కళాకారులకు , ఉరుము కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, యోగానంద, నాయకులు గోవిందప్ప, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

గాండ్లపెంట : మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపిపి జగన్మోహన్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ అంజినప్ప మాట్లాడుతూ15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని. స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు, విద్యుత్ బిల్లులు సర్పంచులతో చర్చించి వెంటనే విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈసందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కృష్ణనాయక్, ఆర్ఐ అశోక్ చక్రం. ఏవో లక్ష్మీ ప్రియతో మపాటు ఆయా శాఖల అధికారులు, వైఎస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఆగ్రహం

కదిరి టౌన్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూలులో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలపై స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి మూడు సంవత్సరాల కాలంలో చేసిన సంక్షేమ పరిపాలన, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతూ ఉంటే చంద్రబాబు నాయుడు విచక్షణ కోల్పోయి ఏమి మాట్లాడుతున్నాడో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. చంద్రబాబు కర్నూలులో వాడిన భాష సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు రాయలసీమ ద్రోహి అని విమర్శించారు. రాయలసీమ ప్రాంతానికి రావలసిన హైకోర్టును అడ్డుకునే ప్రయత్నం చేస్తే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. వైసిపి నాయకులను కానీ కార్యకర్తలను గాని అసభ్య పదజాలాలతో దూషిస్తే తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాము, సర్పంచి అంజనమ్మ, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, ఆర్‌బికె ఛైర్మన్ ఆదిరెడ్డి, మాజీ ఎంపీపీ పుల్లారెడ్డి, సర్పంచులు తిరుమలప్ప నాయుడు, అల్లాబకస్, టెంపుల్ డైరెక్టర్ జయరామిరెడ్డి, సోమిరెడ్డి, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ హైస్కూళ్ల హెచ్‌ఎంలకు డీడీవోలుగా బాధ్యతలు

ధర్మవరం టౌన్ : యుటిఎఫ్ చేసిన పోరాటాల ఫలితంగానే మున్సిపల్ హెచ్‌ఎంలకు డీడీవోలుగా ఉద్యోగోన్నతి పొందుతున్నారని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ధర్మవరం మున్సిపల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఐదుగురిని డీడీవోలు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో యుటిఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాల హెచ్‌ఎం ఉమాపతిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, శ్రీనివాసులు, హరిశంకర్, మహేశ్వరరెడ్డి, లావణ్య, పద్మజరాణి, పార్వతమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు విస్తృత సేవలు అందించాలి

పుట్టపర్తి అర్బన్ : ఐసిఐసిఐ బ్యాంకు ద్వారా ప్రజలకు విస్తతస్థాయిలో సేవలు అందించాలని కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. ఐసిఐసిఐ బ్యాంకు కార్యాలయాన్నికెనరా బ్యాంకు ప్రక్కన ఉన్న నూతన భవనంలోకి శనివారం మార్చిన సందర్భంగా కలెక్టర్ తో పాటు సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకులు ప్రభుత్వ పథకాలతో పాటు అర్హులకు తగిన రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించాలన్నారు. యువతకు ఉపాధి కల్పనకు చిన్న సన్న పరిశ్రమల స్థాపనకు విరివిగా రుణ సౌకర్యం కల్పించాలన్నారు. బ్యాంకు జోనల్ అధికారి హరీష్ బాబు మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందించడానికి సిబ్బంది సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజరు మహమ్మద్ అలీ, అనంతపురం మేనేజర్ సురేష్ కుమార్, స్థానిక బ్యాంకు మేనేజరు పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.